# అనుమానం పెనుభూతం

ఎమ్. దామోదర్ రావు

మా అత్తగారికి సినిమా పిచ్చి. టీవీలో వచ్చేవి సరిపోనట్లు వారం పదిరోజులకొకసారి వీడియోని కూడా తెప్పించుకుంటుంది. నలుగురైదుగురు అమ్మలక్కలు చేరుతారు. సినిమా ఏమాత్రం చూస్తారోగానీ కబుర్లు మాత్రం కంటిన్యూస్‌గా వుంటూ వుంటాయి. ఇప్పుడూ టీవీ హాల్లో పెద్ద ఎత్తున మాటలు వినిపిస్తున్నాయి.

సినిమాలంటే నాకు అయిష్టత ఏమీ లేదు. కాదంటే పూర్తి మూడుగంటలలా ఏకధాటిగా కూచోవాలంటే కొద్ది దుస్సహ్యమైన కథకు అనవసరమైన దృశ్యాలు కూడా చూడాల్సి వస్తుంది. అదే నాకిష్టం ఉండదు. నిజం చెప్పాలంటే ఓ తెలుగు సినిమాని ప్రారంభంలో పది నిముషాలు, మధ్యలో పది నిముషాలు, ఆఖర్న మరో పది నిముషాలు చూస్తే చాలు- మొత్తం తెలిసిపోతుంది.

నేను కూరనోసారి టేస్ట్ చేసి ఉప్పు కాస్త కలిపా. స్టవ్ సిమ్‌లో పెట్టి టీవీ హాల్లోకి వెళ్లి నిల్చున్నా.

''ఇలాంటోడ్ని నిలువునా చీరేయాలి'' నల్లచారల చీరలో సినిమా చూస్తున్న ఓ ముదురు ముత్తైదువ అంది.

''నిజం'' అక్కడున్న తతిమ్మా అందరిదీ కోరస్.

''వీడి దుంపతెగ!''

''అమ్మో వీడు చంపేసేలాగే ఉన్నాడే!''

''ఏం పోయే కాలంరా నీకు. పుట్టగతులే ఉండవ్!''

వాళ్ళల్లోంచి రకరకాల కామెంట్లు వినిపిస్తున్నాయి.

''పాపం'' ఒకావిడ కళ్ళొత్తుకుంటోంది.

సినిమా చూడ్డానికి కుదర్లేదుగానీ పది నిముషాలు వాళ్ళ కబుర్లు విని మళ్ళీ కిచెన్‌లోకి వెళ్లిపోయా. కూర య్యాక దించేసి చేతులు కడుక్కుంటున్నా.

''అమ్మో...మళ్ళీ చంపేస్తున్నాడు...'' ఎవరిదో కేక.

''ఇక పోలీసులొచ్చే టైం అయ్యిందిలే. పట్టుకుని జైల్లోకి నెట్టేస్తారు'' సినిమాల్లో తనకున్న ఎక్స్‌పీరియన్స్ చెబుతోంది మరో ఆవిడ.

వాళ్ళ మాటల్లోనే సినిమా అర్థం అయిపోతోంది నాకు. క్లైమాక్స్ వచ్చేసిందన్నమాట. నా పనులూ అయిపోయాయి. హాల్లోకెళ్లి చూస్తూ కూర్చున్నా. మరి కాసేపట్లో సినిమా అయిపోతోంది. అది అన్నదమ్ముల కథ. అన్న తమ్ముడ్ని హతమార్చి ఆస్తి చేజిక్కించుకుంటాడు. తన్ను తాను భుజం దగ్గర గాయపరచుకుని హత్య వేరెవరో చేసినట్లు, తనమీద హత్య ప్రయత్నం జరిగినట్లు తప్పించుకుంటాడు. ఎండింగ్ సడెన్‌గా చూపించారు. అతగాడి వయస్సు కాస్త పెరిగింది. డ్రెస్సింగ్, సెటప్, సీన్ అన్నీ మారిపోయాయి. ఇప్పుడు వాడొక పెద్ద బిజినెస్ మాగ్నెట్. ఎండింగ్ వాస్తవికంగా జేమ్స్ హడ్లీ చేజ్ నవలకుమల్లే వుంది. హంతకుడికి శిక్ష పడలేదు.

''లోకం తల్లీ! మొన్నీ మధ్యే ఓ సీరియల్‌లో చూసా. అందులోనూ ఇంతే. ఓ చెల్లికి పోనీలే అని ఆశ్రయం ఇస్తే అది స్వంత అక్కనే మోసం చేసి బావని వల్లో వేసుకుని ఆస్తి కాజేస్తుంది.''

''ఇవేమీ సినిమాలూ, సీరియల్స్‌లోనే కాదమ్మా. ఇలాగే అక్షరాలా మా వీధిలోనే జరిగింది. కళ్ళారా చూసాం. పోయినేడు ఇంజనీరు గుర్నాధం చనిపోవడం తెలుసుగా. ఆయన తమ్ముడు పెద్ద జులాయి వెధవ. గుర్నాధం పోయిన నెల్లోనే ఆయన పిల్లల్ని చంపేసాడు. ఆ విషయం వాళ్ళ బాబుకి తెలిసిపోయింది. అంతే వెంటనే కన్నతండ్రిని కూడా చంపేసాడు ఆ పాడు ఆస్తికోసం. చచ్చిపోయిన వాళ్ళ సంగతేమోగానీ పాపం ఆ గుర్నాధం భార్య ఇప్పుడు ఆ జులాయిగాడింట్లో పాచి పనులు చేస్తోంది. యదార్థంగా ఆస్తి అంతా ఆమెదే!''

వాళ్ళ కబుర్లకిక అంతూ పొంతూ వుండదు. నేను బయటకి వచ్చేసా.

• • •

మా అత్తగారికున్న ఓ వీక్‌నెస్ సినిమాలు. ఇంకోటి పనిలేని మూకతో పనికిమాలిన మాటలు. అయితే ఐడిల్ మైండ్ ఈజ్ డెవిల్స్ డెంజన్ లాంటిదే ఆవిడ పరిస్థితి. తతిమ్మా అందరిదీనూ. ఇంట్లో పనులుండవ్. పని చెయ్యడానికి పనోళ్ళూ మాలాటి కోడళ్లు వుంటారు. మరికవేళ ఎలా గడుస్తుంది? కాలక్షేపం ఎలాగవుతుంది? అందుకు ఇలా...

ఓ విధంగా మా అత్తగారు చాలా మంచిది. మమ్మల్ని కూతుళ్ళలానే చూసుకుంటుంది. అయితే పెద్ద బద్ధకస్తురాలు. మామయ్య ఎలా భరించారో గానీ ఇక్కడ పుల్లతీసి అక్కడ పెట్టదు. బహుశా మేం రాకముందు లక్ష్మి నరకాన్నే అనుభవించి వుంటుంది. లక్ష్మి మా పనిమనిషి. వెనుక తోటలో పాక వేసుకుని వుంటోంది. కథని ప్రొసీడ్ చేసేముందు ఈ ఫామిలీ ఉపోద్ఘాతం కాస్త ఇస్తే సబబనుకుంటాను.

మంగపతి మా మామయ్యగారు. చాలా గంభీరమైన మనిషి. అత్యవసరమైతే తప్ప కనీసం భార్యతో కూడా ఓ మాట మాట్లాడరు. అలాని ఎవర్నీ ఇబ్బంది పెట్టరు. ఆయనదొక భారీ వ్యక్తిత్వం. అంతే! మా అత్తయ్య మాణిక్యం. బద్ధకస్తురాలు. పొరుగువాళ్లతో కబుర్ల పిచ్చి. కానీ ఆ తరం వాళ్లతో మమ్మల్ని కలుపుకోదు. మేము అంటే నేనూ, శారద. ఇద్దరం ఆ ఇంటి కోడళ్ళం. శారద నాకంటే పెద్దది. ఓ చక్కని నేస్తాన్ని కూడా మరిపించేది శారదక్క. అందర్లోకి చిన్నదాన్ని నేనే. అందరికీ పనులు చేసి పెట్టడం నాకెంతో హాయిగా వుంటుంది. మా అక్కకి పెద్దగా పనులు రావని కాదు. క్వీక్‌గా చేయలేదు. అది ఆమె స్వభావమేగానీ తప్పుకాదు. అందుకే నేను బాధపడను. మేగ్జిమం వర్కంతా నేనే చేస్తాను. అక్క కేవలం శుభ్రం చేసే పనులే చేస్తుంది. వంటా వార్పూ, పిల్లల్ని స్కూలుకు పంపడం అన్నీ నేనే. అన్నట్లు చెప్పడం మరిచా. శారదక్కకి ఇద్దరు పిల్లలుండేవాళ్ళు. చిన్నోడు నా పెళ్లయిన కొత్తల్లో జబ్బు పడి చచ్చిపోయాడు. అప్పుడు నాకు తెగ భయం వేసేది. పెళ్ళయి కొన్నిరోజులే అయ్యింది. ఇంట్లో నా ఆగమనం ఆ చావుకు కారణంగా, నన్నో అపశకునంగా ఎవ్వరూ భావించరు కదా. కానీ అలా జరగ లేదు. ఇప్పుడు పెద్దబ్బాయి వరుణ్ మాత్రమే ఉన్నాడు. వాడిని తయారుచేసి స్కూలుకు పంపించే పని కూడా నాదే. అక్కకు తీరిక వుండదు. అత్తయ్య పట్టించుకోదు.

చిన్నదాన్ననీ, పనులు చురుగ్గా చేస్తుందనీ నాకు ఇంట్లో చాలా ఫ్రీడం ఇచ్చారు. అప్పుడప్పుడూ

దాగా అత్తయ్యను ఆమె బద్ధకం గురించి టీజ్ చేస్తుంటా. ఆవిడ నవ్వి ఊరుకుంటుంది.

కానీ ఈమధ్యే అత్తయ్యలో ఏదో పెద్ద మార్పే వచ్చింది. మూడురోజుల్నుంచీ గమనిస్తున్నా నేను. మామయ్యగారు వారంరోజుల ముందు వ్యాపారం పనిమీద పట్నమెళ్లారు. మామయ్యలేని దానివల్ల ఆ మార్పొచ్చిందేమో 'అనుకోవడానికి ఆస్కారంలేదు. ఆయనగారున్నా వాళ్ళిద్దరూ మాట్లాడుకోవడమే అరుదు మరి? అయినా నేను చూస్తున్న సింప్టమ్స్ అత్తయ్యలా ఉండడానికి వేరే కారణాల్ని చూపిస్తున్నాయి. మరి శారదక్క ఆ విషయం గమనించిందో లేదో? లేక అక్కకు అసలు సంగతి తెలుసో మరి! ఏమో? కథ ఇక్కడే మొదలవుతుంది.

అత్తయ్య వరండాలో కూర్చుని ఏదో వీక్లీ చదువుకుంటోంది. వరుణ్ స్కూల్‌కెళ్లిపోయాడు. అక్క పై గదిలో కాబోలు వుంది. నేను వెళ్లా.

"అక్కా!"

టేబుల్‌మీదున్న వస్తువుల్ని ఒక్కొక్కటే గుడ్డతో శుభ్రం చేస్తున్నది. నా పిలుపుతో ఇటు తిరిగి ఏమిటన్నట్లు చూసింది.

"ఏమిటక్కా ఇది? ఇరవై నాలుగుగంటలూ ఈ శుభ్రం పనేనా? నేనొక్కత్తినే ఎలా వుంటం?"

"ఏం చేద్దాం మరి?" అడిగింది.

"కొత్త కబుర్లు చెప్పు. అంతే. సరేగానీ అక్కా ఈమధ్య అత్తగారి ప్రవర్తన ఓ రకంగా వుంది గమనించావా?"

"అంటే?" అడిగింది.

"ఓరకమంటే ఇలాగని ఎలా చెప్పను. ఎప్పుడు చూసినా అన్యమనస్కంగా వుంటోంది. కంగారుపడుతోంది. నీకేమీ అత్తయ్యగార్లో మార్పు కనిపించలేదా?" అడిగా.

"నాకూ అనిపించిందనుకో. మామయ్యగారు లేరుగా అందుకేమో?"

"వారుంటే ఏంటట? కనీసం మాట్లాడుకుంటారా ఏం?"

"మాట్లాడుకోరా?"

"ఏ రెండ్రోజులకో ఓ మాట. అందుకే అంత పరధ్యానం అంటే ఒప్పుకోను."

"నరే ఒప్పుకోవద్దు."

"నీవూ మామయ్యగారిలాటి దానివే. మనసు విప్పితే నీ సొమ్మేం పోతుంది?"

"ఏమీపోదు."

"నీ అర్థం నన్ను వెళ్లిపొమ్మనా?"

"అత్తయ్యగారు ఎలా వుంటే నీకెందుకే మంగా? భర్త దూరంగా వుంటే ఎలా వుంటుందో నీకింకా అనుభవంలేదు."

"కేయకు. ఆ మాత్రం దానికి అనుభవం అక్కర్లేదు. ఆలోచన చాలు.. కానీ నాకో సందేహం!"

"ఏమిటో?"

"అత్తగారికి నెల తప్పుంటాదేమో?" పొట్టమీద చేయి వేసి చూపించా.

ఆశ్చర్యంతో అక్క నోరు గుండ్రంగా తెరుచుకుంది.

"ఎందుకని?" అడిగింది.

"అత్తయ్యగార్లో వచ్చిన మార్పుకి అదే కారణం అయ్యుండాలి."

"సిగ్గు లేకపోతే సరి" నెమ్మది స్వరంతో అంది అక్క "అత్తగారు వింటే కోప్పడతారు. నీకసలీ అనుమానం ఎలా వచ్చిందే? ఇవి వేవిళ్ళ వయసులా?"

"అక్కా! నేనూ ముందు అలాగే అనుకున్నా బహుశా మామయ్య లేని దానివల్లే దిగులుగా వుంటోందని. కానీ సూక్ష్మంగా గమనిస్తే అది దిగులు కాదు. ఓ విధమైన భయం. ఈ వయసులో ఆ విషయం నలుగురికీ తెలిస్తే ఎలాగని?"



"అంతా నీ ఊహాగానం!"

"కాదు. నా దగ్గర చాలా రుజువులున్నాయి."

"రుజువులా... అంటే? చెప్పు!"

"అత్తయ్యగారు నెల నెలా బయట పడుతూండేవారా? ఈనెల అలా కాలేదు!"

"ఓస్ అదా నీ అనుమానం?" నవ్వింది "ఓ వయసొచ్చాక అది ఆగిపోతుంది. లేకపోతే అనియమితంగా వస్తుందమ్మా. ఇంతకుముందు కూడా రెండుసార్లు అలా ఆలస్యం అయింది. ఆ మాత్రం దానికే..."

"నా అనుమానానికి ఇంకా కారణాలున్నాయి. రెండోది విను. మొన్నట్రోజు అత్తయ్యగారికి కళ్ళు తిరిగి వామిటింగ్ అయ్యింది."

"నిజమా?"

"అవును. మొన్నట్రోజు పాలు కలుపుతుంటే కళ్ళు తిరిగి నామీద పడిపోయింది. పాలన్నీ వొలికిపోయాయి.

## కోరుకున్నది

యజమాని: ''ఈవేళ వాతావరణ పరిస్థితి ఎలా వుంటుందంటావు?''

నౌకరు: ''నేను ఇష్టపడే విధంగా వాతావరణం వుంటుంది.''

యజమాని: ''నీవు ఇష్టపడే వాతావరణమే వుంటుందని అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?''

నౌకరు: అయ్యా! నేను కోరేది ఎప్పుడూ నేను పొందలేకపోతున్నానని తెలుసుకుని నాకు లభించిన దాన్నే ఇష్టపడడం నేర్చుకున్నాను. కనుక నేను ఇష్టపడే వాతావరణమే వుంటుందని ఖచ్చితంగా చెప్పగలుగుతున్నాను.''

## వీలునామా

ఒక ముసలాయన చిన్నది, కనిపించనిది అయిన చెవిటి మిషన్‌ని తెచ్చుకున్నాడు. అది బాగా పని చేస్తుందని చెప్పడానికి మళ్ళీ ఆ షాపుకి వెళ్లాడు.

''ఏం తాతగారూ! చెవుడూ గివుడూ పోయిందా? ఎలా వుందిప్పుడు?'' అనడిగాడు సేల్స్‌మాన్.


''నా దగ్గర ఆ మిషన్ వుందని మా ఇంట్లో వాళ్ళకు తెలియదు. ఆ తమాషా అంతా నేను అనుభవిస్తున్నాను. గత రెండు వారాల్లో నా వీలునామా నాలుగుసార్లు మార్చాను. అంత అమోఘంగా పని చేస్తోంది నా చెవిటి మిషన్'' చెప్పాడు తాత నవ్వుతూ.

## చాలు

డాక్టర్: ''నీ భర్త నిద్రలో మాట్లాడే అలవాటుని వీలైనంత త్వరలో నయం చేస్తాను.''

రోగి భార్య: ఆయనకు నయం చేయమని నేను అడగడంలేదండీ. ఆ మాట్లాడేది స్పష్టంగా మాట్లాడేటట్టు, నాకర్థమయ్యేట్టు చేస్తే చాలు.''

-స్వాతి




కాసేపు నన్నలా పట్టుకుని వుండిపోయింది. ఏమయ్యిందోనని ఎంత భయపడ్డానో తెలుసా? కానీ వెంటనే తేరుకుని ''కళ్ళు తిరిగాయి మంగా. ఇప్పుడు బాగానే వుందిలే'' అంది. అప్పటిగ్గానీ నా గుండె దడ తగ్గలేదు. కానీ అప్పుడు నాకీ అనుమానం రాలేదనుకో.''

''ఏమో! నిజమేనేమో! మామయ్యగారు మరీ స్ట్రాంగ్ మనిషి. ఈ వయసులో బిడ్డలు పుట్టరని చెప్పలేం'' అంది. అక్కకి ఇప్పుడిప్పుడే నా మాటల్లో నిజాయితీ కనిపిస్తోందన్నమాట.

''ఇంకా చెబుతా విను. అత్తయ్యగారింతకు ముందెప్పుడైనా వరుణ్ విషయం పట్టించుకునే వారా?''

అక్క తల అడ్డంగా ఊపింది.

''ఇప్పుడు ఇరవై నాలుగు గంటలూ వాడితోనే. లేపడం నుంచీ నిద్ర పుచ్చేవరకూ వాడి పడక కూడా తన దగ్గరే.''

''మామయ్యగారు లేరుగా. అందుకేనేమో మంగా. నీవు చెప్పేవన్నీ సబబేగానీ ఖచ్చితంగా చెప్పలేం. ప్రెగ్నెన్సీ లేకుండా కూడా కళ్ళు తిరగొచ్చు. వాంతీ రావచ్చు. వయస్సుబట్టి మెన్ససూ ఆగొచ్చు. మామయ్యగారు లేని కారణంగా వరుణ్ణి తోడుగా వుంచుకోవచ్చు. నీవు ఉత్తినే అపోహ పడుతున్నావేమో!''

''ఒకటి రెండు అయితే అపోహలు కావచ్చు. అన్నీ కాలేవు. ఇంకోటి కూడా వుంది చెబుతా. ప్రెగ్నెన్సీలో కొన్ని పదార్థాలు పాలులాంటివి రుచించవంటారు. వొప్పుకుంటావా?''

''ఆ...''

''అత్తయ్యగారు రోజూ పాలు తాగుతారు తెలుసు కదా. నిన్న రాత్రి ఏమయ్యిందంటే అలవాటు ప్రకారం వరుణ్‌కి పాలివ్వబోయాను. వరుణ్ అత్తగారి రూంలో ఆడుకుంటూ పాలొద్దన్నాడు. బలవంతంగా నేనివ్వబోతే తను తీసుకుని ''తర్వాత నేను తాగిస్తాలే మంగా'' అంది. సరే అని ఇచ్చా. తెల్లవారి చూద్దునుగదా. పాలన్నీ కిటికీ బయట పడున్నాయి. ''ఏంటత్తయ్యా! వరుణ్‌కి పాలు తాగించలేదా?'' అన్నా. ''వాడొద్దన్నాడే'' అంది. ''మరి మీరైనా తాగక పోయారా?'' అడిగా.

''ఆ...నేనా?'' అంది అదేదో విషమన్నట్లు. తర్వాత తేరుకుని ''రాత్రి పాలు పాడైపోయాయమ్మా. అందుకే పారేసా'' అంది. రాత్రి కాచిన పాలు రాత్రే ఎలా పాడవుతాయి? ఐనా బయటపడ్డ పాలు నేనూ చూసాగా. పాడేమీ కాలేదు.

''నీవు చెప్పేది నిజమైతే గమ్మత్తే మరి.''

''ఇంకా అనుమానమా?''

''పోనీ అత్తగార్ని అడిగేద్దాం. కంగారేం చెప్పొచ్చు.''

''వద్దు అత్తయ్యగార్నే చెప్పనిద్దాం. ఎంతవరకూ దాస్తుందో చూడాలి.''

బయట శబ్దం వినిపించింది. గేలరీలోకొచ్చి చూసా. వరుణ్ స్కూల్ నుంచి వచ్చాడు. మరో రెండు నిముషాల్లో అత్తయ్యా వాడూ తోటలోకి వెళ్లిపోయారు.

• • •

ఉదయాన్నే ఏవో ఘుమఘుమలు నా ముక్కుపుటాలకి సోకి మెలకువ వచ్చింది. వంటింట్లోంచి ఉప్మా కాఫీల వాసన. వరుణ్, అత్తయ్య కబుర్లాడుకుంటున్నారు. మామూలుగా అయితే ఎనిమిదిగ్గానీ ఏనాడూ మంచం దిగని అత్తయ్య, ఏనాడూ వంట చేసి ఎరుగని అత్తయ్య ఈవాళ ఏడు కాకుండానే లేవడమేకాదు, అన్నీ ముగించింది. మంచిదే. ఈవాళ నాకు కాఫీ, టిఫిన్ చేసే పని తప్పింది.

''ఏమిటత్తయ్యా! ఈ రోజు చాలా హుషారుగా వున్నారు. మామయ్యగారొస్తున్నారా?'' ఆవిడ దగ్గరకెళ్లి అడిగా.

నా తలమీద మొట్టి కాస్త కోపంగా ''నీకు చిన్నా పెద్దా తేడా లేకుండా పోతోంది'' అంది. తర్వాత నెమ్మదిగా ''ఈవేళ నేను వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్తున్నా. వరుణ్ణి కూడా తీసుకెళ్తా'' అంది

''ఈరోజు శనివారం కాదు కదా అత్తయ్యా'' అమాయకంగా అడిగా.

''గుడికెళ్లడానికి ఏ రోజయితేనేం?'' ఆవిడ స్వరం ఇక మాటలు పొడిగించడానికి ఇష్టం లేనట్టుగా వుంది.

ఏ నర్సింగ్‌హోమ్‌కో వెళ్తోందేమో! మనసులో అనుకున్నా. లేకపోతే తీయించుకుందుకో. అలాగైతే వరుణ్ణి ఎందుకు తీసుకెళ్లడం? ఊ...ఎవరికీ అనుమానం రాకుండా గుప్‌చిప్‌గా పని చేయించుకోవడానికన్నమాట. వరుణ్ణి అలా పార్కులో వుంచి ఆడుకొమ్మని అరగంటలో పని ముగించుకోవచ్చు. తెలివైందే!

మా అత్తగారు వెళ్లాక నేనూ శారదక్కా తీరిగ్గా కబుర్లలో పడ్డాం.

''పెందరాళే లేవడం, వంట చేయడం, ఆదివారంపూట గుడికెళ్లడం...అన్నీ విచిత్రంగా లేవూ?'' అడిగా.

''ఏమో! మామయ్యగారు వస్తున్నారుగా. అందుకు చేయించడానికి వెళ్లిందేమో!''

ఇక మా అక్కతో మాట్లాడడం వేస్టు. ప్రతిదానికీ ఇదంటే అదంటుంది. నా దృష్టిలో మాత్రం అత్తయ్య తల్లి కాబోతోంది. ఆ విషయాన్ని తీసుకుని

చేసినంత ఆనందగా వుంది నాకు.

గంటలు ఇట్టే గడిచిపోయాయి.

మధ్యాహ్నం అత్తగారూ, వరుణ్ భోజనానికి కూడా రాలేదు. గుడికెళ్లిరావడం అంటే మహా అంటే ఓ గంట పని అంతే. ఇప్పుడు నా అనుమానం పూర్తిగా బలపడిపోయింది. డాక్టర్ దగ్గరకెళ్లడం, గర్భం తీయించుకోవడం గంటల్లో అయ్యే పనేనా? వరుణ్ భోజనం గురించి అక్క కంగారు పడుతోంది. ఎంతయినా కన్నతల్లి హృదయం.

''ఇప్పుడైనా ఒప్పుకుంటావా?'' అడిగా.

''ఏమిటీ ఒప్పందాలు చేసుకుంటున్నారు?'' అంటూ సరిగ్గా అప్పుడే మామయ్యగారు లోనికొచ్చారు.

''రండి మామయ్యగారూ. బాగున్నారా?'' అక్కయ్య అడిగింది.

''మీరు తండ్రి కాబోతున్నారు'' నేను గమ్మత్తుగా అన్నా. అన్నాక ఎందుకో భయం వేసింది. ఆయన దగ్గర అంత చనువులేదు నాకు.

''తండ్రి కావడమేమిటి?'' గంభీరంగా అడిగారు.

మా అక్క మోచేత్తో నన్ను పోరగా పొడిచి ఏమీ మాట్లాడవద్దని సైగ చేసింది. నేను మాత్రం పట్టించుకోకుండా ''మీరు మళ్ళీ తండ్రి కాబోతున్నారు మామయ్యా'' అన్నా.

''ఏమిటీ నీ పిచ్చి. సరిగ్గా చెప్పు.''

''అత్తయ్యగారు మళ్ళీ తల్లవబోతున్నారు మామయ్యగారూ.''

''అదెల్లాగవుతుంది. నేను ఆపరేషన్ చేయించుకుని పాతికేళ్ళయ్యింది.''

ఇప్పుడు షాక్ తినడం నావంతయింది.

''పిచ్చిదిలే మామయ్యా. మొన్న అత్తయ్యగారికి కళ్ళు తిరిగాయట. అందుకలా అనుకుంటోంది'' నా తలమీద మొట్టి అక్క ఏదో సర్ది చెప్పాలని చూసింది. మామయ్యగారు పట్టించుకోకుండా లోనికి నడిచారు. అమ్మయ్య!

సాయంత్రం అత్తయ్య, వరుణ్‌లు వచ్చారు. వస్తూనే అత్తయ్య మామయ్యగారి గదిలోకి వెళ్లి తలుపేసుకుంది. నేను వడివడిగా వెళ్లి తలుపు దగ్గర ఆగా. చెవులు రిక్కించి విన్నా. వాళ్ళేదో రహస్యంగా మాట్లాడుతున్నారు. కానీ ఒక్క ముక్కా స్పష్టంగా వినబడ్డంలేదు. ఇక అక్కడ ఉండడం మంచిది కాదు. నేను పక్కకు వచ్చేసి వరుణ్ణి కేకేసా.

''ఈ మూడు రోజులూ పాలే తాగలేదు. రామ్మా తాగుదువుగానీ.''

నేను పాలు కలపడానికి కిచెన్‌లోకెళ్లా. వరుణ్ వాళ్ళమ్మని విడిపించుకుని పరుగెత్తుకొచ్చాడు. నేను పాలు కలిపి వరుణ్‌కి ఇవ్వబోయాను. అంతే...సడెన్‌గా అత్తయ్యగారొచ్చి ఆ గ్లాసును తోసేసారు.

''చూడండి. ఇదే...ఇలాగే'' అంటూ వెనగ్గా వస్తున్న మామయ్యతో ఆయాసపడుతూ అంది. నాకేసి తిరిగి ''ఈ పాలల్లో ఏం కలిపావ్?'' కాస్త కోపంగా అడిగింది. అత్తయ్య ముఖంలో కోపం చూడ్డం అదే మొదటిసారి.

ఆవిడ అలా ఎందుకంటోందో నాకర్థంకాలేదు.

''ఏమీ కలపలేదు'' అన్నా.

''నేను చూసా. అదిగో ఆ అల్మారాలోంచి ఏదో తీసి కలిపావ్. చూపించు.''

''అవునత్తయ్యా. అవి విటమిన్ టాబ్లెట్లు. డాక్టర్ ఇచ్చినవి.''

''నిజమా? మరెందుకు రహస్యంగా దాచుకు దాచుకుని కలిపావ్?''

''అవి కలపడం చూస్తే వరుణ్ తాగడు. ఏమిటత్తయ్యా నేనేమి కలిపానని అనుకుంటున్నారు?'' అసహనంగా వుంది నా స్వరం.

మామయ్య వచ్చి నా భుజం తట్టారు ''మీ అత్తయ్య పిచ్చిదిలే తల్లీ! నీవేం మనసులో పెట్టుకోకు. నీవలా రహస్యంగా కలపడం లక్ష్మి మొన్నెప్పుడో చూసిందిట. దీనికి చెప్పింది. పనుల్లేని అమ్మలక్కలుంటారుగా. అందరూ కలసి దీనిని భయపెట్టారు. వరుణ్ అడ్డు తొలగితే మొత్తం ఆస్తి నీ సంతానానికే వస్తుంది కాబట్టి నీవేదో అఘాయిత్యం చేస్తావని నూరిపోసారు. ఈ సినిమాల పిచ్చిది నమ్మేసింది. మనసులో పెట్టుకోకేం?''

నా ముందు మబ్బు తెరలు ఒక్కొటీ విడిపోతున్నాయి. అంతలోనే అత్తయ్య మీద చచ్చేంతకోపం వచ్చింది. సరిగ్గా అప్పుడే నా బుగ్గలపై మెట్లు విరిచి ''నన్ను క్షమించమ్మా. పాపిష్టిదాన్ని నీలాటిదాన్నే అనుమానించా'' లెంపలేసుకుంది అత్తయ్య.


నాకు నవ్వాగింది కాదు. అత్తయ్య ఆ రోజు ఈ రోజూ నా చేతిలో పాలు తోసేయడం, కిటికీ బయట పాలు ఒలకబోయడం, ఇరవై నాలుగు గంటలూ వరుణ్ణి అంటి పెట్టుకుని వుండడం, వాడికి తనే పాలూ, టిఫిన్, భోజనాలు పెట్టడం, తనే వంట చేయడం... అన్నింటికీ కారణాలు ఇప్పుడర్థమవుతున్నాయి. తన మనసులోని అనుమానం ఇన్ని రోజులు చెప్పలేక మింగలేక పాపం ఎంత బాధపడిందో? మామయ్యగారొచ్చాక అంతా వారి చెవిలో వూదేసినట్లుంది.

''నన్ను క్షమించాలి అత్తయ్యా. తప్పుడు అనుమానాలతో నేనూ ఏదేదో ఊహించుకున్నా మీరు మళ్ళీ తల్లి కాబోతున్నట్లు... అంటున్నా.

''ఆ...'' అంటూ ముక్కుమీద వేలేసుకుంది అత్తయ్య.

★

## అతి శీతల ఉష్ణ ప్రదేశాలు



భూమిమీద అతి ఉష్ణ ప్రదేశాలు కొన్ని వున్నాయి. భారతదేశంలోనూ, ఆస్ట్రేలియాలోనూ 53 డిగ్రీల ఉష్ణోగ్రతను కూడా రికార్డు చేసిన ప్రదేశాలున్నాయి. కాలిఫోర్నియాలో సుప్రసిద్ధ డెత్‌వాలీ ఉష్ణోగ్రత 56 డిగ్రీలు. ఉత్తర ఆఫ్రికా లిబియాలో 57 డిగ్రీల ఉష్ణోగ్రత వుంటుంది. కానీ వీటి అన్నింటికంటే మించినది మెక్సికో ఉష్ణోగ్రత 58 డిగ్రీలు. ఇక అతి శీతల ప్రదేశాల్లో రష్యాలోని యాకూటియాలో ఒయిమ్యాకోన్ స్టేషన్‌లో -78 డిగ్రీలు రికార్డు అయింది.

## మనిషి భరించగల ఉష్ణోగ్రతలు

బ్లాడెన్, చాంట్రి అనే ఇద్దరు ఇంగ్లీషు వైద్యులు మనిషి భరించగల అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలను తెలుసుకోవడానికి ప్రయోగాలు చేసారు. వారు 71 డిగ్రీల ఉష్ణోగ్రతను భరించగలిగారు. ప్రయోగ సమయంలో వారు బట్టలు ధరించలేదు. కానీ అత్యల్ప ఉష్ణోగ్రతకు బట్టలు లేకుండా ప్రయోగం చేయలేకపోయారు. అందుకే ధృవ ప్రాంతాలను పరిశోధించేవారు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ కరెంట్‌తో వెచ్చదనం కలిగించే బట్టలు ధరిస్తారు.

## భ్రమలో ముంచిన చిత్రాలు

పారిస్‌లో ఒక బీద విద్యార్థిగా వున్నప్పుడు స్పానిష్ చిత్రకారుడు పాబ్లోపికాసో తన గది గోడల మీద బల్లలు, కుర్చీలు మొదలైన గృహోపకరణాల చిత్రాలను వాటి వాస్తవిక ప్రమాణంలో చిత్రించేవాడు. అవి నిజమైన వస్తువులుగా కనిపించేవి. ఆ ఇంటి ఓనరు గోడలను తడిమి చూసి అవి చిత్రాలే అని ఆశ్చర్యపడిపోయేవాడు.

- స్వాతి

